సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 10 । మార్చి । 2023



హడలెత్తిస్తున్న కాపర్ కేటుగాళ్లు

రైతులు వ్యవసాయం కోసం ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ తీగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు.

- 8లో ▸



ప్రభుత్వ బడుల్లో చదివించాలి

సర్కారు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, వాటిలోనే చదివించాలని ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /19.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జెడ్పీ డిప్యూటీ సీఈవోగా సుందర వరదరాజన్



నిజామాబాద్ నాగారం : జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా డి. సుందర వరదరాజన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా డిప్యూటీ సీఈవోగా బాధ్యతలు నిర్వహించిన ఆయన బదిలీపై జిల్లాకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు.

కేటీఆర్ పర్యటనకు భారీ బందోబస్తు



నిజాంసాగర్(జుక్కల్): ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 13న పర్యటించనున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం నిజాంసాగర్ మండలంలోని గోర్గల్, జక్కాపూర్ గ్రామాల్లో హెలీప్యాడ్ స్థలాన్ని, నాగమడుగు పైలాన్ వద్ద ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, నాగమడుగు ఎత్తిపోతల శంకుస్థాపన, పిట్లం బహిరంగ సభాస్థలం వద్ద ఏర్పాట్లపై పోలీసులతో సమీక్షించారు. మంత్రి పర్యటించే రోడ్డు మార్గంతో పాటు కల్వర్టులు, గ్రామాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. హెలీ ప్యాడ్ స్థలం నుంచి మంజీర వంతెన, గెస్ట్ హౌస్, నాగమడుగు శంకుస్థాపన, పిట్లం బహిరంగ సభ స్థలానికి రోడ్డు మార్గాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, స్థానిక ఎస్సై నాగగోని రాజు తదితరులున్నారు.

13న మధ్యాహ్న భోజనం బంద్



రెంజల్(బోధన్): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 13న మధ్యాహ్న భోజనం నిలిపివేస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తెలిపారు. గురువారం రెంజల్ ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీఎం కేసీఆర్, కార్మికులకు నెలకు రూ.3 వేలు అందిస్తానని మాట తప్పారని పేర్కొన్నారు.

11న జిల్లాలోకి రేవంత్‌రెడ్డి పాదయాత్ర



కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ఈనెల 11న బాల్కొండ నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి మండలం ద్వారా జిల్లాలోకి ప్రవేశిస్తుందని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన కమ్మర్‌పల్లిలో సమావేశంలో మాట్లాడారు. 11వ తేదీ శనివారం రాత్రి జగిత్యాల జిల్లా నుంచి కమ్మర్‌పల్లికి చేరుకుంటుందన్నారు. 12న ఆదివారం పాదయాత్రకు విరామం ఉన్నందున రేవంత్ రెడ్డి ఉదయం భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్టను దర్శించుకుంటారు. కమ్మర్‌పల్లికి 11 గంటలకు చేరుకొని మధ్యాహ్నం 2 వరకు రైతులతో మాట్లాడతారు. సాయంత్రం 4 గంటలకు వివిధ కుల సంఘాల సభ్యులతో, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమవుతారన్నారు. 13వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలకు కమ్మర్‌పల్లి నుండి పాదయాత్ర ప్రారంభమై 11 గంటలకు ఉప్లూర్‌కు చేరుకుంటుందని, భోజన విరామం అనంతరం సాయంత్రం 4 గంటలకు అక్కడి నుండి బయలుదేరి రాత్రి 7 గంటలకు ఏర్గట్లకు చేరుకుంటుందన్నారు. అనంతరం బాల్కొండలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర ముగుస్తుందన్నారు. ఈ పాదయాత్రను సక్సెస్ చేసేందుకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్ కుమార్ గౌడ్, పీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమన్వయం చేస్తున్నారన్నారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు వేణుగోపాల్ యాదవ్, వేణురాజ్, వెంకటేష్‌గౌడ్, శ్రీను, ప్రవీణ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

తెయూలో అవినీతి అధ్యాయం

- వర్సిటీలో మళ్లీ అక్రమ నియామకాలు
- ఇప్పటికే అదనపు సిబ్బంది
- పని లేకున్నా వచ్చివెళ్తున్నారని విద్యార్థుల ఆరోపణ
- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ తెలంగాణ యూనివర్సిటీలో రెండు నెలల్లోనే ఏకంగా 135 మందికి పైగా సిబ్బందిని నియమించారు. గతంలోనూ ఇదేవిధంగా నియమించిన 130 మందికి పైగా సిబ్బందిని విద్యాశాఖ కమిషనర్, పాలక మండలి ఆదేశాల మేరకు వెంటనే తొలగించారు. ఏడాది తర్వాత వీసీ మరోసారి అక్రమ నియామకాలకు తెర లేపారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.



తెయూ(డిచ్‌పల్లి) : ప్రభుత్వ అనుమతి లేకుండా రాష్ట్రంలోని ఏ వర్సిటీలోనూ ఎలాంటి పోస్టులు భర్తీ చేయవద్దని ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలను తెలంగాణ యూనివర్సిటీ ఉన్నతాధికారులు బేఖాతరు చేస్తున్నారు. వివిధ విభాగాల్లో పని భారం ఉందని రోజువారీ వేతనం పేరిట ఎడాపెడా సిబ్బందిని నియమిస్తున్నారు. రెండు నెలల్లోనే ఏకంగా 135 మందికి పైగా సిబ్బందిని వివిధ విభాగాల్లో నియమించడం వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. వర్సిటీలో అనుమతి పొందిన అవుట్‌సోర్సింగ్ సిబ్బంది 276 మంది ఉన్నారు. ఇప్పటికే అవసరానికి మించి ఉద్యోగులున్నారని 2021 నవంబర్‌లో జరిగిన పాలక మండలి సమావేశంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌పై అప్పటి కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిత్తల్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వీసీగా నియమితులైన కొద్దినెలల్లోనే ఎడాపెడా 130 మందికిపైగా సిబ్బందిని నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యా కమిషనర్ వెంటనే వారిని తొలగించాలని ఆదేశించారు. 276 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందితోనే పనిచేయించుకోవాలని సూచించారు. పాలక మండలి ఆదేశాల మేరకు సిబ్బందిని అప్పట్లో తొలగించారు.

మరోసారి నియామకాలు..

ఏడాది పాటు ఎలాంటి నియామకాలు చేపట్టని వీసీ తాజాగా మరోసారి అక్రమ నియామకాలకు తెర లేపారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేకున్నా సుమారు 135 మందికి పైగా సిబ్బందిని నియమించారు. ఈ విషయం తెలిసిన రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఫిబ్రవరి 20న నియామకాలు చేపట్టవద్దని మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకవేళ చేపడితే చర్యలుంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయినా తెయూ ఉన్నతాధికారులు ఈ ఉత్తర్వులను ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కాసులిస్తే పోస్టు గ్యారంటీ..

ఒక్కో పోస్టుకు ఒక్కో రేటు నిర్ణయించి అవసరం లేకున్నా నియామకాలు చేపట్టారు. వర్సిటీలో నియామకాలకు ఈసీ, ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈసీ అనుమతించినా దినపత్రికల్లో నోటిఫికేషన్ వేసి అర్హత, రోస్టర్ చూసి ఎంపిక చేయాలి. ఇవేవీ లేకుండానే సిబ్బంది కొరత, రోజువారీ కూలీల పేరుతో వర్సిటీ ఉన్నతాధికారులు ముడుపులు తీసుకుని నేరుగా నియామకాలు చేపడుతున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ. 1.50 లక్షల చొప్పున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీసీ కోసం నలుగురు పీఏలు, ఒక బాడీగార్డు, ఛాంబర్‌లో ముగ్గురు అటెండర్లు, ముగ్గురు స్వీపర్లు పని చేస్తున్నారు. వీసీ రెసిడెన్స్ వద్ద ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ఒక విభాగం డీన్ ఆఫీస్‌లో ఆరుగురు, హెల్త్ సెంటర్‌లో 12 మంది, గర్ల్స్ హాస్టల్‌లో ముగ్గురు లేడీ సెక్యూరిటీ గార్డులు, పరీక్షల విభాగంలో అదనంగా ఆరుగురు, బాలుర హాస్టల్స్‌లో 10 మంది చొప్పున, గెస్ట్ హౌస్‌లో ఆరుగురు సిబ్బందిని నియమించారు. ఇలా డబ్బులు ఇచ్చిన వారికి ఏదో ఒక విభాగంలో నియమించారు. వీరిలో చాలా మంది ఏపని లేకున్నా రోజూ వచ్చి సాయంత్రం వెళ్లిపోతున్నట్లు విద్యార్థి నాయకులు ఆరోపిస్తున్నారు.

ఆందోళనలో సిబ్బంది

గతనెల 20న వచ్చిన ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓయూ పరిధిలో 2014 జూన్ 2 తర్వాత ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించిన టీచింగ్, నాన్-టీచింగ్ స్టాఫ్‌ను తొలగించాలని ఈనెల 6న రిజిస్ట్రార్ సర్క్యులర్ జారీ చేశారు. ఓయూ సర్క్యులర్ తెయూ వర్సిటీ సిబ్బంది వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో ముడుపులు ముట్టచెప్పి అక్రమంగా నియామకమైన సిబ్బందిలో ఆందోళన నెలకొంది. తమను ఎప్పుడు తొలగిస్తారో తెలియక సతమతమవుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి అనుమతి లేకుండా నియమించిన సిబ్బందికి చెల్లించిన వేతనాల విషయమై ఉన్నత విద్యాశాఖ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని వర్సిటీలో చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని విద్యార్థి సంఘాలు వీసీపై చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖకు ఫిర్యాదు చేశారు.

గోశాల భూమికి ఎసరు!



సారంగపూర్ వద్ద గోశాల భూమి ఫెన్సింగ్ తొలగించిన దృశ్యం

- ఫెన్సింగ్‌ను తొలగించిన కబ్జాదారులు
- గోశాల నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న భూముల కబ్జాపై అధికారుల చర్యలు ఏమాత్రం లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములు, కెనాల్ భూములు, చెరువు శిఖం భూములు తేడా లేకుండా ఆక్రమించుకుని ప్లాట్లు చేసి అమ్ముకునే ముఠాలు భారీగానే ఉన్నాయి. ఈ ముఠాలకు అధికార పార్టీ నాయకులే అండదండగా నిలవడంతో అడ్డూ అదుపూ లేకుండా కబ్జాలు చేస్తున్నారు. చివరకు గోశాల భూములను సైతం కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నిజామాబాద్‌లోని సారంగపూర్ ఏరియాలో శ్రీ గోశాలకు చెందిన భూమిని ఆక్రమించుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

1977లో ప్రభుత్వం మరణించిన గోవుల అంత్యక్రియల కోసం ఇక్కడ ఐదెకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిలోనే గత 46 సంవత్సరాలుగా మరణించిన ఆవులను ఖననం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ భూమిని స్వాహా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నం చేశారు. గోశాల స్థలానికి సంబంధించి కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను తాజాగా ఒక బృందం వాళ్లు తొలగించారు. 1977 నుంచి గోశాల ఆధ్వర్యంలో ఉన్న ఈ భూమి తమదంటూ మేకల గణేశ్ అనే వ్యక్తి ఫెన్సింగ్‌ను తొలగించడంతో గోశాల నిర్వాహకులు కమల్‌కిశోర్ ఇనాని, మేనేజరు కృష్ణారావు ఏసీపీకి, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరో టౌన్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో సాయికుమార్ గణేశ్‌పై కేసు నమోదు చేశారు. భూమి ఉంటే సర్వేయర్ ద్వారా సర్వే చేయించుకోవాల్సింది పోయి ఇలా ఆక్రమణ ప్రయత్నం చేయడం పట్ల ఈ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ భూమి ఆక్రమణ ప్రయత్నం వ్యవహారం వెనుక కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల హస్తం ఉంటుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే ఒక వ్యక్తి ఇంతగా తెగించి సుమారు యాభై ఏళ్ల నుంచి గోశాల పరిధిలో ఉన్న భూమిలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేయడమేమిటంటున్నారు.

నేడు ఉద్యోగ మేళా

నిజామాబాద్ నాగారం : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగమేళాకు అపోలో ఫార్మసీ, రిటైల్ ట్రెయినీ అసోసియేట్, ఫార్మసీ అసిస్టెంట్, ట్రెయినీ ఫార్మసిస్ట్, ఫార్మసిస్ట్ ఉద్యోగాలున్నాయన్నారు. విద్యార్హత ఇంటర్/డిగ్రీ/డీఫార్మసీ/బీఫార్మసీ/ఎంఫార్మసీ(విత్ పీసీఐ), వయో పరిమితి 18 నుండి 30 ఏళ్ల వరకు ఉండాలన్నారు. నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్‌లో రావాలన్నారు. వివరాలకు 95817 68413, 99594 56793 ద్వారా సంప్రదించాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు జిల్లా ఉపాధి కార్యాలయం శివాజీనగర్‌కు, బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో, సర్టిఫికెట్స్ తీసుకొని రావాలన్నారు.

ఆన్‌లైన్‌లో మాయమైన ఎంసెట్ సెంటర్లు

- ఉమ్మడి జిల్లా విద్యార్థుల్లో ఆందోళన
- దూర ప్రాంత సెంటర్లు ఎంచుకోలేకపోతున్న అభ్యర్థులు
- తక్కువ సెంటర్ల ఏర్పాటు వల్లే ఈ పరిస్థితి అంటున్న అధికారులు

నిజామాబాద్ అర్బన్ : ఎంసెట్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఉమ్మడి జిల్లా పరీక్ష కేంద్రాలు కనిపించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈనెల 3న ఎంసెట్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా మొదటి నాలుగు రోజులు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల సెంటర్లు వెబ్‌సైట్‌లో కనిపించాయి. ఈ నెల 7న సాయంత్రం నుంచి ఈ రెండు జిల్లాల సెంటర్లు కనిపించడం లేదని అభ్యర్థులు హైరానా పడుతున్నారు. పక్క జిల్లాలైన జగిత్యాల, నిర్మల్‌తోపాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు సెంటర్లు వెబ్‌సైట్‌లో కనిపిస్తున్నాయి. ప్రతి ఏడాది నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు వేల నుంచి మూడు వేల మంది విద్యార్థులు ఎంసెట్ ఇంజనీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్ విభాగాలకు దరఖాస్తులు చేసుకుంటారు. ఈ సారి బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు కూడా ఎంసెట్‌కు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. వచ్చే ఏప్రిల్ 10న ఎంసెట్‌కు దరఖాస్తుల గడువు ముగుస్తుంది. కాగా వెబ్‌సైట్‌లో సెంటర్లు అందుబాటులో లేకపోవడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ప్రతి ఏటా నిజామాబాద్‌లో 25, కామారెడ్డిలో 12 వరకు ఎంసెట్ సెంటర్లు ఏర్పాటు చేస్తారని గతంలో జిల్లా కో ఆర్డినేటర్లుగా పనిచేసిన అధికారులు స్పష్టం చేశారు. ఈ సారి అందులో సగం సెంటర్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఉమ్మడి జిల్లా సెంటర్ల ఆప్షన్‌లు తొందరగా పూర్తయినట్లు వారు పేర్కొంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉమ్మడి జి ల్లాలో పరీక్ష సెంటర్లు పెంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని విద్యార్థులు కోరుతున్నారు. వందల కి.మీ దూరంలో ఉండే ఇతర జిల్లాలకు వెళ్లి పరీక్ష రాయడం ఇబ్బందిగా ఉంటుందని వాపోతున్నారు.



న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఖలీల్‌వాడి : న్యాయవాదులపై ట్రాఫిక్ పోలీసులు దౌర్జన్యాన్ని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం గణపతి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి చేసిన ట్రాఫిక్ ఎస్సైను సస్పెండ్ చేయాలన్నారు. ఎస్సైపై చర్య తీసుకునే వరకు ధర్నాతో నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఆశ నారాయణ తదితరులు ఉన్నారు.

ప్రబలుతున్న ఇన్‌ఫ్లూయెంజా

- జిల్లాలో విస్తరిస్తున్న హెచ్3ఎన్2 వైరస్
- జ్వరం, దగ్గు, జలుబు ముఖ్య లక్షణాలు
- మారుతున్న సీజనే కారణం



జీజీహెచ్‌లో ఓపీ కౌంటర్ వద్ద బారులు తీరిన రోగులు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

నిజామాబాద్ సిటీ : జిల్లాలో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా క్రమంగా విస్తరిస్తోంది. ఇటీవల ఈ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. కోవిడ్ మహమ్మారి తదనంతర పరిణామాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజల్లో హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూయెంజా వైరస్ కలకలం రేపుతోంది. ఈ లక్షణాలతో ఉన్నవారు జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రి, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. గురువారం జీజీహెచ్‌లో 1,154 ఓపీ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొంతమంది ఇది సాధారణ ఫ్లూగా అనుకుంటూ సరైన రోగనిర్ధారణ చేసుకోకుండా, వైద్యులకు చూపించుకోకుండానే మెడికల్ షాప్‌లకు వెళ్తూ ఫ్లూ మందులు, యాంటీ బయోటిక్ ట్యాబ్లెట్లు తీసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) నుంచి ఈ మధ్య ప్రకటన వెలువడింది. దీని ప్రకారం ఎవరైతే దగ్గు, జలుబు వంటి లక్షణాలతో బాధపడుతున్నారో వారు వైద్యులను సంప్రదించకుండా సొంత వైద్యం చేసుకోవద్దన్నారు. ఈ ఫ్లూ అనేది ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారికి వెంట నే సోకుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అలా గే వాయు కాలుష్యం మొదలగు కారకాలు హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూఎంజా ప్రబలడానికి కారణమవుతుందని వృద్ధులు, పిల్లలు, గర్భిణులు ఎక్కువ సంక్రమణకు గురవుతున్నారన్నారు.

నివారణకు మార్గాలివే..

ఈ వైరస్ బారిన పడకుండా రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఎక్కువగా తిరగరాదు. అనారోగ్య వ్యక్తులతో భౌతికదూరం పాటించాలి. మాస్కులు ధరించాలి. చేతులు ఎప్పుడు శుభ్రంగా కడుక్కోవాలి. ఫ్లూ సోకితే 24 గంటల పాటు ఇంట్లోనే ఉండాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి.

ఇవీ లక్షణాలు..

జ్వరం, దగ్గు, ముక్కు కారటం వంటి శ్వాసకోశ సమస్యలతో పాటు, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు, అతిసారం వంటి హెచ్3ఎన్2 ఇన్‌ఫ్లూఎంజాకు ప్రధాన లక్షణాలని వైద్యులు తెలుపుతున్నారు. వీటివల్ల ఉబ్బసం ఉన్న రోగులు, తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు వాతావరణ మార్పుల సమయంలో తగు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి ఈ వైరస్ సోకితే లక్షణాలు మరింత తీవ్రంగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తగు జాగ్రత్తలు తీసుకోవాలి

హెచ్3ఎన్2 ఈ వేరియంట్ వల్ల కుటుంబంలో ఒకరి నుంచి మరొకరికి వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. తద్వారా, తీవ్రమైన దగ్గు, తలనొప్పి, గొంతునొప్పులతో ఆస్పత్రులకు వస్తున్నారు. దగ్గు, జలుబు, గొంతునొప్పి మూడు నుంచి నాలుగు వారాలకు ఇబ్బందిగా ఉంటుంది. కొంతమందిలో న్యుమోనియా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వయసుతో సంబంధం లేకుండా ప్రజలు ఈ వైరస్ బారిన పడుతున్నారు. కాబట్టి ప్రజలు సీజన్ మారుతున్న దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

– జలగం తిరుపతిరావు, జనరల్ ఫిజీషియన్

జ్వర పీడితులతో జీజీహెచ్ కిటకిట

వాతావరణంలో మార్పులు రావడంతో చిన్న, పెద్ద తేడాలు లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలివస్తున్నారు. దీంతో ఉదయం 8 గంటల నుంచే జీజీహెచ్‌లోని ఓపీ వద్ద బారులు తీరుతున్నారు.

మాస్ కాపీయింగ్‌కు తావులేదు

విద్యార్థులూ.. ఒత్తిడి వద్దు

- పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు
- ఈనెల 15 నుంచి ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేశాం
- ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘురాజ్

సాక్షి ఇంటర్వ్యూ

నిజామాబాద్ అర్బన్ : ఈనెల 15 నుంచి జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 'సాక్షి'తో ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఈనెల 15 నుంచి 29 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

ప్రశ్న : పరీక్షల ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి.

జవాబు : జిల్లాలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో 54 సెంటర్లను గుర్తించి నీరు, విద్యుత్, బెంచీలు ఇలా అన్ని సదుపాయాలు కల్పించాం. సిబ్బంది నియామకం కూడా పూర్తయ్యింది. వీరికి శిక్షణనిస్తున్నాం.

■ జిల్లాలో ఎంతమంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

■ జిల్లావ్యాప్తంగా 35,017 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఇందులో ఫస్టియర్ విద్యార్థులు 17,503 కాగా సెకండియర్ విద్యార్థులు 17,514 మంది ఉన్నారు. 4,354 మంది ఒకేషనల్ విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరవుతారు.

■ మాస్ కాపీయింగ్ నిరోధానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి..?

■ జిల్లాలో రెండేళ్ల క్రితం నుంచి అరికడుతు న్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. జిల్లావ్యాప్తంగా మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలలపై ప్రత్యేక నిఘా ఉంటుంది. ఇప్పటివరకు మాస్‌కాపీయింగ్‌కు అవకాశం పరీక్ష కేంద్రాలను ప్రత్యేకంగా గుర్తించలేదు. అయితే అనుమానమున్న ప్రతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీలు చేస్తాం.

■ కొన్ని ప్రైవేట్ కళాశాలలు మాస్ కాపీయింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి.



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాజ్

■ ఇందులో ఎలాంటి నిజం లేదు. ప్రతి సెంటర్‌ను ప్రత్యేక బృందాలు సాధారణ తనిఖీ బృందాలు నిరంతరంగా తనిఖీలు చేస్తాయి. జిల్లాలో ప్రతి సెంటర్ మా కంట్రోల్‌లో ఉంటుంది. జిల్లాలోని బోధన్, ఆర్మూర్ కొన్ని దూర ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలపై గతంలో ఆరోపణలు వచ్చాయి. అలాంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

■ సిబ్బంది నియామకాలు ప్రైవేట్ కళాశాలలకు అనుకూలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

■ అలాంటిదేమీ లేదు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ప్రభుత్వ కళాశాలలకు చెందినవారే ఉంటారు. ఇన్విజిలేటర్లను సైతం జిల్లా విద్యాశాఖ నుంచి కొందరిని తీసుకుంటాం. అవసరమైతేనే ప్రైవేట్ కళాశాలల సిబ్బందిని తీసుకుంటాం. వారుకూడా వారు పనిచేసే కళాశాలలకు సంబంధం లేని ప్రాంతాల్లోనే పనిచేస్తారు.

■ విద్యార్థులను ఫీజు కడితేనే హాల్ టిక్కెట్లు ఇస్తామని కొన్ని కళాశాలలు వేధిస్తున్నాయి.

■ హాల్ టికెట్లు విద్యార్థులు నేరుగా ఇంటర్నెట్ నుంచి డౌన్లోడ్ చేసుకునే సదుపాయం ఉంది. అలాకాకుండా ప్రైవేట్ కళాశాలలు ఫీజుల కోసం వేధిస్తే మా దృష్టికి తీసుకురావాలి.

■ ఏడాది పూర్తి సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో ఏమైనా మార్పులున్నాయా?

■ ఈ ఏడాది ఇంటర్ పూర్తి సిలబస్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నాం. పూర్తిస్థాయి సెలబస్‌తోనే పరీక్షలుంటాయని విద్యార్థులకు కళాశాలల్లో అధ్యాపకులు ఇప్పటికే తెలపడం జరిగింది.

■ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మీ శాఖ ద్వారా తీసుకుంటున్న నివారణచర్యలేమిటి.?

■ విద్యార్థులకు తల్లిదండ్రులు, అధ్యాపకులు ఒత్తిడి తగ్గేలా ధైర్యం చెప్పాలి. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికావద్దు మానసికంగా కుంగిపోవద్దు. ఒక వేళ పరీక్షల్లో ఫెయిలైతే ఫలితాలొచ్చిన తర్వాతి నెలలోనే అడ్వాన్స్‌డ్ ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలుంటయి కాబట్టి మళ్లీ రాసుకునే అవకాశ ముంది. ఏడాది నష్టపోకుండా ఉంటుంది.

ఇంటర్ విద్యార్థుల వివరాలు

ఫస్టియర్	17,503
సెకండియర్	17,514
ఒకేషనల్	4,354
పరీక్ష కేంద్రాలు	54

పరీక్ష సమయం : ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

క్లుప్తంగా

నేటి నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్‌ పోటీలు



పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి ఆల్‌ఫోర్స్‌(నరేంద్ర) హైస్కూల్‌లో శుక్రవారం నుంచి 37వ రాష్ట్రస్థాయి బాలుర సబ్‌ జూనియర్‌ హ్యాండ్‌బాల్‌ పోటీలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా గురువారం హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా హడాక్‌ కమిటీ చైర్మన్‌ గంగామోహన్‌ చక్రు, కన్వీనర్‌ పింజ సురేందర్‌, కో–కన్వీనర్‌ రాజేష్‌, పీఈటీ విద్యాసాగర్‌రెడ్డి క్రీడామైదానాన్ని పరిశీలించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పది జట్లు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. ఆర్గనైజింగ్‌ సెక్రటరీ సురేష్‌, పీఈటీలు రాజేందర్‌, నాగేష్‌, శ్యామ్‌, చిన్నయ్య, సురేష్‌, రమణ, హరీష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం రేట్‌ను తగ్గిస్తాం



పిట్లం(జుక్కల్‌): కామారెడ్డి జిల్లాలో క్రైమ్‌ రేట్‌ను తగ్గిస్తామని, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పిట్లం పోలీస్‌ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించి,స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఇటీవల పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌,ఆయిల్‌ చోరీ చేసిన దుండగులను త్వరలో పట్టుకుంటామన్నారు.ప్రతి గ్రామంలో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు 13న మండలకేంద్రంలో మంత్రి కేటీఆర్‌ సభ నిర్వహించనుండగా.. సభాస్థలిని పరిశీలించారు. డీఎస్పీ జగన్నాథ్‌ రెడ్డి, ఎస్‌ఐ విజయ్‌కొండ, పోలీస్‌ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం



సాక్షి ఎఫెక్ట్‌..

నిజాంసాగర్‌(జుక్కల్‌): అటవీ ప్రాంతాల్లో టేకు దొంగలు అంటూ సాక్షి దిన పత్రికలో గురువారం వచ్చిన కథనానికి బాన్సువాడ రేంజ్‌ అధికారిణి సంతోషి స్పందించారు. అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికి అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను గురువారం బాన్సువాడ అటవీశాఖ రేంజ్‌ అధికారులు పట్టుకున్నారు. సింగితం గ్రామ శివారులో, అటవీ ప్రాంతంలో అటవిశాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టి, అక్రమంగా నిల్వ ఉన్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ రెంజ్‌ అధికారిణి సంతోషి తెలిపారు.

పాతకక్షలతో కత్తిపోట్లు



బాన్సువాడ రూరల్‌: మండలంలోని ఇబ్రాహింపేట్‌ తండాకు చెందిన ధారవత్‌ కిషన్‌ తన పంట పొలం వద్ద గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు కత్తిపోట్లకు గురయ్యాడు. పాత కక్షలలో గ్రామానికి చెందిన సురేందర్‌, మాన్‌సింగ్‌లు కత్తులతో దాడిచేశారు. గతంలో తన మరి ది మోహన్‌కు సురేందర్‌ కూతురుతో వివాహం జరిగి విడాకులు అయ్యాయని, ఈ కారణంగా తన భర్తను చంపాలనే ఉద్దేశంతో నిందితులు దాడిచేశారని క్షతగాత్రుని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. క్షతగాత్రున్ని నిజామాబాద్‌ జిల్లా ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

హడలెత్తిస్తున్న కాపర్‌ కేటుగాళ్లు

- ఆర్మూర్‌ మండలంలో ఆరు నెలల్లో 13 ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం
- సుమారు రూ.12లక్షలు నష్టం



ఆర్మూర్‌లోని యానం గుట్ట సమీపంలో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌



ఫత్తేపూర్‌లో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ఆర్మూర్‌టౌన్‌: రైతులు వ్యవసాయానికి ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ లేకుండా పోయింది. రైతులు కష్టపడి అధికారులు చుట్టూ తిరిగి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసుకుంటే గుర్తు తెలియని దుండగులు మాత్రం రాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి, కాపర్‌ తీగను దొంగలిస్తున్నారు. ఆర్మూర్‌ మండల పరిధిలో పలు గ్రామాల్లో తరచు దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి కాపర్‌తీగను చోరీ చేస్తున్నారు. దీంతో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలల్లో ఆర్మూర్‌ మండలంలో 13చోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం చేసిన ఘటనలు నెలకొన్నాయి.

అర్ధరాత్రుల్లోనే..

దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అర్ధరాత్రుల్లోనే చేస్తున్నారు. పంటపొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అర్ధరాత్రుల్లో నిర్మానుష్యంగా ఉండటంలో వారు యథేచ్ఛగా చోరీ చేస్తున్నారు. మొదట ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్‌ సరఫరా నిలిపివేయడానికి ఎండిన కర్రల సాయంతో ఇన్సులేటర్లను పగలగొడుతారు. ఆ తరువాత గద్దెలపై నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందకు పడేసి, ధ్వంసం చేసి అందులోని కాపర్‌ తీగను చోరీ చేస్తున్నారు. అనంతరం దొంగలించిన కాపర్‌ను బయట విక్రయించి సొమ్ముచేసుకుంటారు. ట్రాన్స్‌ఫార్మర్‌ చోరీలతో ప్రజాధనం నష్టంతో పాటు, విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుకు సుమారు రూ. 60వేల నుంచి రూ. 90వేల వరకు ఖర్చు అవుతుందని అధికారులు చెబుతున్నారు. అలాగే నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చాడానికి సుమారు వారం రోజుల సమయం పడుతుంది. దీంతో రైతులు పండించిన పంటకు బోర్ల ద్వార నీరు అందించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జరిగిన చోరీలు ఇవే..

ఆర్మూర్‌ మండలం ఫత్తేపూర్‌ గ్రామంలో, ఆర్మూర్‌ శివారు యానంగుట్ట వద్ద బుధవారం రాత్రి రెండు చోట్ల దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని కాపార్‌ తీగను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత ఆరు నెలల్లో మామిడిపల్లిలో నాలుగు, చేపూర్‌లో రెండు, గోవింద్‌పేట్‌లో 2, ఫత్తేపూర్‌ ఒకరి, దేగాంలో రెండు, ఇస్సాపల్లి, రాంపూర్‌లో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి కాపర్‌ను చోరీ చేశారు. ధ్వంసమైన వాటిలో 100కేవీ, 25కేవి, 16కేవీల ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. సుమారు రూ.12లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

అవగాహన కల్పిస్తున్నాం..



గ్రామ ప్రజల సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ దుండగులను పట్టుకునేందుకు అవగాహన కల్పిస్తున్నాం. రాత్రి సమయంలో ఎవరైన పొలాల వెంట తిరిగితే వారిని పట్టుకొన్ని విచారించాలని సూచిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌ దొంగలించడంలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోంది. –భాస్కర్‌ప్రసాద్‌, ఏఈ, పెర్కిట్‌

కేసులు నమోదు చేశాం..



విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదుతో ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై కేసులు నమోదు చేశాం. చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకుంటాం. గ్రామస్తులు సైతం అప్రమత్తంగా ఉండి ఏదైన ఉంటే సమాచారం పోలీసులకు అందించాలి. –సురేష్‌బాబు, ఎస్‌హెచ్‌వో,ఆర్మూర్‌

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీపీ నాగరాజు

ఖలీల్‌వాడి: రాష్ట్ర క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటి, తెలంగాణకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని సీపీ నాగరాజు పేర్కొన్నారు. నిజామాబాద్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మహిళ ఫుట్‌బాల్‌ కోచింగ్‌ క్యాంప్‌ను సీపీ ప్రారంభించి, క్రీడాకారులకు కిట్స్‌ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడారు. రాష్ట్ర క్రీడాకారులకు నిజామాబాద్‌లో కోచింగ్‌ క్యాంప్‌ నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. క్రీడాకారులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 9నుంచి 23వరకు ఈ క్యాంప్‌ కొనసాగుతుందన్నారు. అనంతరం 28న పంజాబ్‌ రాష్ట్రంలో నిర్వహించే జాతీయస్థాయి మహిళా ఫుట్‌బాల్‌ టోర్నీలో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. అదనపు డీసీపీ గిరిరాజ్‌, ఏఆర్‌ ఏసీపీ సంతోష్‌ కుమార్‌, డాక్టర్‌ కవితారెడ్డి, జిల్లా ఫుట్‌ బాల్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ మసూద్‌ ఎజాజ్‌, ట్రెజరర్‌ మీర్‌ ఫారుఖ్‌ అలీ, సెక్రటరీ జావీద్‌, కోచ్‌ నాగరాజు, పాల్గొన్నారు.

విద్యార్థులు భయాందోళనలు వీడాలి



బాన్సువాడ రూరల్‌: పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు భయాందోళనలు వీడాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు గాలి నరేందర్‌ సూచించారు. గురువారం మండలంలోని బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విజయస్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. బట్టీకొట్టే చదువుకు స్వస్తి పలికి ఎక్కువ కాలం గుర్తుండిపోయేలా పలు మెళుకువలు నేర్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ అయ్యాల సంతోష్‌రావు, ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్‌, ఉపాధ్యాయులు మహేష్‌, రాములు, సరిత, శ్వేతా, అనంద్‌, శ్రావణ్‌, శ్రీనివాస్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి

- ఆర్టీసీ చైర్మన్‌, రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌
- గూపన్‌పల్లిలో 'మన బస్తీ– మన బడి' భవనం పారంభం



గూపన్‌పల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్‌ బాజిరెడ్డి గోవర్ధన్‌

నిజామాబాద్‌ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల వసతులు కల్పిస్తుందని, ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ఆర్టీసీ చైర్మన్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ అన్నారు. నిజామాబాద్‌ రూరల్‌ మండలం గూపన్‌పల్లి గ్రామంలో మన బస్తీ మన బడి కార్యక్రమం కింద నిర్మించిన పాఠశాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన బస్తీ మన బడి కార్యక్రమం కింద రాష్ట్రంలో 26,065 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 9,123 పాఠశాలలను ఎంపిక చేసి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ. 7,289 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పాఠశాలలో ప్రహరీ, టాయిలెట్స్‌ నిర్మాణం, అభివృద్ధి పనులు, విద్యుత్‌, తాగునీటి సౌకర్యం, ఫర్నిచర్‌ కొనుగోలు తదితర 12 రకాల అభివృద్ధి పనులతో కార్పొరేట్‌ పాఠశాలను తలపించే విధంగా తయారు చేశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమే ప్రభుత్వం అప్పులు చేస్తోందన్నారు. నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌ ఏ గ్రామానికి ఒక్క రూపాయి అయినా ఇచ్చారని అని ప్రశ్నించారు. వైస్‌ ఎంపీపీ అన్నం సాయిలు, డీఈవో దుర్గాప్రసాద్‌, కార్పొరేటర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, ఎంఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలవి మాటలు తప్ప చేతలు లేవు..

ధర్పల్లి(ఇందల్‌వాయి): జిల్లాలో బీజేపీ నాయకులు ఉత్త మాటలు మాట్లాడటం తప్ప కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టే చేతలు లేవని ఆర్టీసీ చైర్మన్‌, నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ ఆరోపించారు. ఇందల్‌వాయి మండలంలోని లోలంలో గురువారం పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌ ఎంపీ లోలం గ్రామానికి ఒక్క రుపాయి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌, ఎంపీపీ రమేష్‌నాయక్‌, డీసీఎంఎస్‌ చైర్మన్‌ మోహన్‌, సర్పంచ్‌ మమత, ఉపసర్పంచ్‌ లక్ష్మీ, ఎంపీటీసీ సరిత, పాల్గొన్నారు.

గెస్ట్‌ లెక్చరర్లకు అందని వేతనాలు

- ఏడు నెలలుగా నిధులు కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న అతిథి అధ్యాపకులు

మోర్తాడ్‌(బాల్కొండ): డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో ఉన్నత విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.2022 ఆగస్టులో గెస్ట్‌ లెక్చరర్లుగా నియమించబడిన వారికి ఏడు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. దీంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఉమ్మడి జిల్లాలో 100మంది..

నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల్లోని మోర్తాడ్‌, ఆర్మూర్‌, భీమ్‌గల్‌, ధర్పల్లి, నిజామాబాద్‌, బోధన్‌, బిచ్కుంద, ఎల్లారెడ్డి, బాన్సువాడ, కామారెడ్డి డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో సుమారు 100మంది గెస్ట్‌ లెక్చరర్‌లను అధికారులు నియమించారు. వీరంతా వారానికి 72 గంటల పాటు నెలకు 288 గంటల పాటు విధులు నిర్వహించాల్సి ఉంది. వీరికి నెలకు రూ.20వేలకు పైగా వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. 2022–23 విద్యా సంవత్సరానికి గాను నియమించబడిన గెస్ట్‌ లెక్చరర్‌లతో ప్రస్తుతం ఆయా కళాశాలల్లో తరగతుల నిర్వహణ సాగుతుంది. గెస్టు లెక్చరర్లలో కొందరు స్థానికంగా ఉండి డిగ్రీ కళాశాలల్లో తరగతులను బోధిస్తుండగా, మరికొందరు దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళుతున్నారు.దీంతో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో వీరి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు ప్రతి నెలా వేతనాలు అందించాలని గెస్టు లెక్చరర్లు కోరుతున్నారు.

బిల్లులు చేసి పంపించాం..

గెస్ట్‌ అధ్యాపకులకు సంబంధించిన వేతనాల బిల్లులు తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపించాం. నిధులు విడుదల కాగానే వారి ఖాతాల్లో జీతాలు జమ అవుతాయి. మా వద్ద ఎలాంటి పెండింగ్‌ లేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– డాక్టర్‌ పెద్దన్న, ప్రిన్సిపాల్‌, మోర్తాడ్‌ డిగ్రీ కళాశాల

ఐదు గదులకు రూ.75 లక్షలా?

- కాంట్రాక్టర్‌పై స్పీకర్‌ పోచారం ఆగ్రహం
- బాన్సువాడ కళాశాలకు తెల్లారేసరికి ఫర్నిచర్‌ రావాలని ఆదేశం



కాంట్రాక్టర్‌, ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ప్రాంగణంలో రూ.75లక్షల నిధులతో గ్రౌడ్‌ ఫ్లోర్‌లో ఐదు, ఫస్ట్‌ ఫ్లోర్‌లో నాలుగు ఉర్దూ మీడియం తరగతి గదులను నిర్మించాల్సి ఉండగా.. కేవలం ఐదు గదులనే నిర్మించడంపై సదరు కాంట్రాక్టర్‌పై స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జూనియర్‌ కళాశాల ప్రాంగణంలో ఉర్దూమీడియం ఐదు తరగతి గదులను స్పీకర్‌ ప్రారంభించారు. తరగతి గదుల్లో ఫర్నిచర్‌(బెంచీలు, ఫ్యాన్లు, టేబుల్‌) ఏర్పాటు చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్‌ నిధులు సరిపోలేవనే సాకును చూపించారు. దీంతో సంబందిత కాంట్రాక్టర్‌ సిద్దిమాంరెడ్డిపై స్పీకర్‌ మండిపడ్డారు. కేవలం ఐదు గదులకే రూ.75లక్షలు అయిపోయాయ, విద్యార్థులు నేలపై కుర్చుంటారా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్నప్పుడు మీరేం చేస్తున్నారని ప్రిన్సిపల్‌ పాండురంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెల్లారెసరికి ఫర్నిచర్‌ రావాలి అని ఆదేశాలు జారీ చేశారు.

అందుబాటు ధరలకే ధాత్రి టౌన్‌షిప్‌ ప్లాట్లు

- నేడు కలెక్టరేట్‌లో ప్రీ-బిడ్‌ సమావేశం
- కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: నగర సమీపంలోని ధాత్రి టౌన్‌షిప్‌లో ప్లాట్లను అందుబాటు ధరలకే అందిస్తోందని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరానికి అతి చేరువలో మల్లారం వద్ద ప్రభుత్వపరంగా నెలకొల్పిన ధాత్రి టౌన్‌షిప్‌లో అతి తక్కువ ధరలకే నివాస స్థలాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాత్రి టౌన్‌ షిప్‌ ప్రత్యేకతలు తెలియజేసేందుకు, ఔత్సాహికుల సందేహాలు నివృత్తి చేస్తూ ముందస్తు అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఉదయం 11.00 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మీటింగ్‌ హాల్‌లో ప్రీ–బిడ్‌ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్‌ కోరారు.

16న రెండోవిడత వేలం..


ఆహ్లాదకరమైన వాతావరణం, అన్ని అనుమతులు పొంది, డీటీసీపీ అప్రువుడ్‌ లేఅవుట్‌ కలిగిన ధాత్రి టౌన్‌ షిప్‌లో ఇంటి స్థలం కొని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రజలకు కలెక్టర్‌ సూచించారు. సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా మోడల్‌ టౌన్‌ షిప్‌ రూపుదిద్దుకుంటోందని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సువిశాలమైన 60 ఫీట్ల అప్రోచ్‌ రోడ్డు, 30 నుంచి 40 ఫీట్ల విస్తీర్ణంతో కూడిన అంతర్గత రోడ్లు, ప్రభుత్వ పరంగా నీటి వసతి, విద్యుత్‌ సరఫరా, సీసీ డ్రెయిన్లు, ఎస్‌టీపీ, టౌన్‌షిప్‌ చుట్టూ ప్రహరీ నిర్మాణం జరిపిస్తున్నామన్నారు. ధాత్రి టౌన్‌ షిప్‌ నుంచి కేవలం 9కి.మీ దూరంలో నిజామాబాద్‌ ఆర్టీసీ బస్‌స్టాండ్‌, రైల్వే స్టేషన్‌ ఉందన్నారు. 76 ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో వివిధ సైజులలో మొత్తం 316 ప్లాట్లు అందుబాటులోకి రానున్నాయన్నారు. తొలి విడతలో 80 ప్లాట్ల అమ్మకాల కోసం నవంబర్‌ 14న బహిరంగ వేలం నిర్వహించామన్నారు. ప్రస్తుతం రెండో విడతగా ఈ నెల 16న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (న్యూ కలెక్టరేట్‌)లో బహిరంగ వేలం నిర్వహించనున్నామన్నారు. చదరపు గజం ప్రారంభ ధర కేవలం 6000 రూపాయలుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్‌(తూప్రాన్‌): మెదక్‌ జిల్లాలోని కాళ్లకల్‌ గ్రామ శివారులోగల జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డికి చెందిన సిద్దిరాములు గురువారం తన కుమారుడిని తీసుకుని బైక్‌పై మేడ్చల్‌ నుంచి కామారెడ్డికి బయలుదేరాడు. కాళ్లకల్‌ గ్రామశివారులోని జాతీయ రహదారిపైకి అకస్మాత్తుగా వచ్చిన జేసీబీని ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న సిద్దిరాములు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో ఆస్పత్రికి తరలించారు.

పింకూది ఆత్మహత్య కాదు.. హత్య

- వివరాలు వెల్లడించిన పోలీసులు
- భర్త హోమ్‌సింగ్‌ అరెస్టు



మాక్లూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరహరి

మాక్లూర్‌: ఈ నెల 7న మండలంలోని అమ్రాద్‌తండాలో జరిగిన మాలోత్‌ పింకూ (26)ది ఆత్మహత్య కాదని, ఆమె నిద్రలో ఉండగా భర్త హోమ్‌సింగ్‌ ఆమె మెడకు తాడుతో ఉరి బిగించి హత్య చేశాడని నిజామాబాద్‌ నార్త్‌జోన్‌ సీఐ నరహరి పేర్కొన్నారు. మాక్లూర్‌ పోలీస్‌ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పింకూ ఆత్మహత్య చేసుకోలేదని అత్త పీరుబాయి, భర్త హోమ్‌సింగ్‌లే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రికరిస్తున్నారంటూ మృతురాలి తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో విచారణ కోసం గురువారం ఉదయం అమ్రాద్‌ తండా వెళుతుండగా పోలీసులను గమనించిన హోమ్‌సింగ్‌ తప్పించుకోనే ప్రయత్నం చేయటంతో అక్కడే అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పింకూ భర్త హోమ్‌సింగ్‌ను 6నెలలుగా శారీరకంగా దూరం ఉంచుతుందన్న విషయమై ఇద్దరి మధ్య కొద్ది రోజులుగా గొడవలు జరగడంతో కుల పెద్దలు రాజీ చేసి వెళ్లినట్టు తెలిపారు. అంతలోనే పింకూ గర్భవతి అని తెలియడంతో ఆమెపై అనుమానం పెంచుకుని, ఈ నెల 7న తెల్లవారు జామున నిద్రలో ఉండగానే నైలాన్‌ తాడుతో ఉరి బిగించి హత్య చేసినట్టు విచారణలో వెల్లడించారన్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఎస్సై యాదగిరిగౌడ్‌, సిబ్బంది ఉన్నారు.

పోలీస్‌ స్టేషన్‌పై దాడిచేసిన మహిళలపై కేసు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని పోలీస్టేషన్‌పై దాడి చేసి, పోలీసులను దుర్భాషలాడిన పలువురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు గురువారం సదాశివనగర్‌ సీఐ రామన్‌ తెలిపారు. వివరాలు ఇలా.. హోలీ పండుగ రోజు గ్రామానికి చెందిన గొడ్డు మాంసం వ్యాపారి షఫీ ఆవును వధించాడని గ్రామానికి చెందిన జబ్బర్‌, హజ్మత్‌ అబద్ధపు ప్రచారం చేసి, కొందరు యువకులను రెచ్చగొట్టి షఫీ ఇంటిపై దాడి చేశారు. షఫీ ఫిర్యాదు మేరకు విచారణ చేసి జబ్బర్‌, హజ్మత్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం వారిని రిమాండ్‌కు తరలించే క్రమంలో వారి కుటుంబాల్లోని పలువురు మహిళలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫర్నిచర్‌నును చిందరవందర చేశారు. అడ్డుకున్న పోలీసు సిబ్బందిపై దుర్భాషలాడుతూ, చేయి చేయిచేసుకున్నారు. దీంతో జబ్బర్‌, హజ్మత్‌తో పాటు పోలీసులపై దుర్భాషలాడి చేయి చేసుకున్న మహిళ అక్తరీని రిమాండ్‌ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పోలీస్టేషన్‌పై దాడి చేసిన మహిళలతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ఆస్పత్రి సిబ్బందిపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆగ్రహం

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రిలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఒకరిపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ చేయి చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం సీతాయిపల్లికి చెందిన ఎమ్మెల్యే అనుచరుడు, పార్టీ కార్యకర్త తన భార్య జ్యోతి(28)కి చికిత్స నిమిత్తం ఎనిమిది రోజుల క్రితం నగరంలోని ఎస్‌ఆర్‌ ప్రయివేట్‌ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తూ వచ్చారు. మంగళవారం రాత్రి జ్యోతి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి సిబ్బంది చెప్పటంతో కుటుంబసభ్యులు వైద్యులను నిలదీశారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే సురేందర్‌ ఆస్పత్రికి చేరుకొని, ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతుండగా..ఓ వ్యక్తి దురుసుగా ప్రవర్తించడంతో ఎమ్మెల్యే ఆగ్రహంతో అతడిపై చేయిచేసుకున్నారు. దీంతో వెంటనే ఆస్పత్రి వైద్యుడు వచ్చి ఎమ్మెల్యేకు జ్యోతి పరిస్థితిని వివరించారు. అనంతరం ఆమెను అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. కాగా ఎమ్మెల్యే చేయిచేసుకున్న ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

డ్రెయినేజీలో పడి ఒకరికి గాయాలు



ఎల్లారెడ్డి: పట్టణంలోని ఇనాందార్‌ కాలనీలో బుధవారం రాత్రి ప్రమాదవశాత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుడు మురికి కాలువలో పడి, గాయపడినట్లు స్థానికులు తెలిపారు. కాలనీలో నుంచి వెళ్తున్న ఉపాధ్యాయుడు ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడిపోవడంతో వెంటనే స్థానికులు గమనించి అతడిని కాలువలో నుంచి బయటకు తీశారు. అతడికి గాయాలు కావడంతో 108కు సమాచారం అందించి, ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు.

బాలికపై లైంగిక దాడి కేసులో ఐదేళ్ల జైలు

నిజామాబాద్‌ లీగల్‌: బాలికపై శరీర స్పర్శ ద్వారా లైంగిక దాడి చేసిన ఓ నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ నిజామాబాద్‌ పోక్సో కోర్టు స్పెషల్‌ జడ్జి శ్రీనివాస్‌రావు గురువారం తీర్పు వెల్లడించారు. ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్‌ హౌస్‌ అధికారి తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన కోటి మల్లేశ్‌, ఆర్మూర్‌ దగ్గర పిల్ల గుట్టలోని మామిడితోటలోగల ఒక ఇంటిలో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకునేవాడు. బోధన్‌లోని రాకాసిపేటకు చెందిన ఒక వ్యక్తి తన భార్య మరణాంతరం ముగ్గురు పిల్లలతో కలిసి బతుకు తెరువు కోసం ఆర్మూర్‌ పిప్రిగల్లీకి వెళ్లి ఒక యాజమాని దగ్గర బర్ల కాపరిగా పనిచేసేవాడు. ఇల్లు కిరాయికి దొరకకపోవడంతో తన తమ్ముడి స్నేహితుడైన మల్లేశ్‌ ఇంటిలో తన ముగ్గురు పిల్లలతో ఉండేవాడు. అతను లేనిసమయంలో మల్లేశ్‌ ఆ వ్యక్తి తొమ్మిదేళ్ల కూతురును రాత్రి సమయంలో లైంగిక దాడికి గురిచేసేవాడు. దీంతో నిందితుడిపై బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువు కావడంతో మల్లేశ్‌కు భారత శిక్ష్యాస్మృతి సెక్షన్‌ 354 ఎ ప్రకారం రెండు సంవత్సరాల జైలుశిక్ష , రూ.5వేల జరిమానా, పోక్సో చట్టం సెక్షన్‌ 7 ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని యెడల అదనంగా ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ఆర్మూర్‌ పోలీస్‌ కార్యాలయ అధికారి తరపున పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ పిడుగు రవిరాజ్‌ ప్రాసిక్యూషన్‌ నిర్వహించారు.